క్లుప్తంగా

రేపు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

చుంచుపల్లి: జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం గురువారం ఉదయం 10 గంటల నుంచి స్థానిక జెడ్పీ హాల్‌లో నిర్వహించనున్నట్లు సీఈఓ ప్రసూనరాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని పేర్కొన్నారు.

ఉద్యమ స్థాపకుడు రాందాస్



మాట్లాడుతున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ ఉద్యమ స్థాపకుడు కొలిశెట్టి రాందాస్ అని 1996 తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వి.శాంతిరాం అన్నారు. కొలిశెట్టి రాందాస్ మృతి పట్ల బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద ఉద్యమకారులు, కార్మిక సంఘాల నాయకులు సంతాప సూచకంగా నల్లబ్యాడ్జీలు ధరించారు. ఈ సందర్భంగా శాంతిరాం మాట్లాడుతూ... రాందాస్ తెలంగాణ కోసం ఉద్యమించిన తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి దయానంద్, సీహెచ్ గెర్షోము, బిక్కులాల్, శివ, మురళి, రషీద్ పాల్గొన్నారు.

జార్జ్ ఆశయాలు సాధిద్దాం..



జార్జ్ స్తూపం వద్ద పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కార్మిక ఉద్యమ నిర్మాత, జార్జ్ ఆశయాలు సాధిద్దాం అనిసింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు అన్నారు. మంగళవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని రామవరంలో జార్జ్ 33వ వర్ధంతిని ఆయన స్తూపం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ఎమ్మెస్ ప్రకాశ్ జెండాను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. సింగరేణి కార్మిక ఉద్యమంలో కార్మిక సంఘం సృష్టికర్త, కార్మికుల సంక్షేమం, హక్కుల కొరకు యూనియన్ ప్రత్యేక పాత్ర పోషిస్తుందని, ప్రతీ కార్మికుడికి యూనియన్ అండగా ఉండాలని, ఎంప్లాయీస్ యూనియన్ స్థాపనలో ప్రధాన పాత్ర పోషించినట్లు చెప్పారు. కార్యక్రమంలో విజయగిరి శ్రీనివాస్, రమేష్ కుమార్ మక్కడ్, పసుపులేటి శ్రీనివాస్, బ్రహ్మచారి, రాజారావు, వై.వెంకటేశ్వరరావు, బాలరాజు, భుక్యా రమేష్, సూరం అయిలయ్య, కూరపాటి సమ్మయ్య, పప్పుల వెంకట్, నందిపాటి రమేష్, కోడి మురళీకృష్ణ, వెంకటేశ్వరరావు, రఘు, ప్రమోద్, మల్లయ్య, పాష పాల్గొన్నారు.

వృద్ధుడిపై కోతుల దాడి

టేకులపల్లి: కోతుల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండల కేంద్రంలోని బ్రహ్మంగారి వీధికి చెందిన జాటోత్ శంకర్ అనే వృద్ధుడు సెంటర్‌కు వచ్చి నిత్యావసరాలు తీసుకెళ్తున్న క్రమంలో గుంపుగా వచ్చిన కోతులు దాడి చేశాయి. శంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. అధికారులు స్పందించి మండల కేంద్రంలో కోతులను నివారించాలని కోరుతున్నారు.

ఏరియా జీఎం కార్యాలయంలో నీటి ఎద్దడి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం చుట్టూ మూడు గనుల్లో పుష్కలమైన నీరు, మరోవైపు పంపుల సంపు, ఇంకోవైపు ఫిల్టర్‌బెడ్, ఇవన్నీ ఉన్నా జీఎం కార్యాలయంలో పది రోజులుగా నీరు లేకుండా పోయిందని, తాగునీరు రాక మహిళా ఉద్యోగులు నానా ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా జీఎం కార్యాలయంలో ఉన్న ఆర్వో ప్లాంట్‌లో తలెత్తిన సమస్య వలన కార్యాలయంలో నీటి ఎద్దడి ఒక కారణమైతే, జీఎం కార్యాలయానికి వచ్చే పంపులు మరమ్మతులకు గురవడం మరో సమస్యని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఏరియాలో సుమారు 15 వేల గ్యాలన్ల నీటిని సివిల్ సిబ్బంది విడుదల చేస్తున్నారు. వాటిలో ఏరియా జీఎం కార్యాలయంలో వాటర్ సమస్య గురించి సెంకడరీ స్థాయి అధికారులు చెబితేనే సివిల్ ఉద్యోగులు పనిచేస్తారని వారిని చెప్పేవారు లేకపోవడంతో నీటి ఎద్దడి తలెత్తిందని వెంటనే ఈ సమస్యను పరిష్కారించాలని జీఎం కార్యాలయం సిబ్బంది కోరుతున్నారు.

మూడేళ్లుగా తెగని పంచాయితీ

- ఇటు మున్సిపాలిటీ, అటు పంచాయతీ
- రూ.2 కోట్లు మంజూరైనా నిరుపయోగం
- 16వ వార్డులోని మురుగుతో ఎదురుగడ్డ పంచాయతీ రోడ్డుపై గుంతలు
- ఇబ్బంది పడుతున్న స్థానికులు, వాహనాదారులు



ఎదురుగడ్డ వద్ద తారు రోడ్డుపై గుంతల్లో నిలిచిన మురుగు

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం మున్సిపాలిటీలోని 16వ వార్డులోని మురుగు నీరు లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగడ్డ పంచాయతీలోని రోడ్డుపైకి వస్తోంది. ఈ పంచాయతీ మూడు సంవత్సరాలైనా పరిష్కారానికి నోచుకోవటం లేదు. తారు రోడ్డుపై మురుగు నిల్వ ఉండడంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా మున్సిపాలిటీ అధికారులు గానీ, ఎదురుగడ్డ పంచాయతీ అధికారులు గానీ పట్టించుకోవటం లేదు. ఎదురుగడ్డ గ్రామం ప్రారంభంలో ఉన్న తారురోడ్డుపైకి.. కొత్తగూడెం మున్సిపాలిటీలోని 16వ వార్డుకు చెందిన మురుగు నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఆ రోడ్డు అస్తవ్యస్తంగా తయారయింది. పెద్దపెద్ద గుంతలు ఏర్పడి మురుగు నిల్వ ఉంటోంది. కొత్తగూడెం పట్టణం నుంచి ఇల్లెందుకు ఎదురుగడ్డ గుండా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.

వాహనచోదకులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పలు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఎండాకాలంలోనూ రోడ్డుపై మురుగు నిల్వ ఉంటోంది. దీంతో కొత్తగూడెం నుంచి ఇల్లెందు రాకపోకలు సాగిస్తున్న ఆటోలు, లారీలు, ద్విచక్ర వాహనదారులు ఈ గుంతలు దాటేందుకు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది.

ట్రాక్టర్లతో ధర్నా...

గత ఏడాది ఈ సమస్య పరిష్కరించాలని ఎదురుగడ్డ సర్పంచ్ కవిత రోడ్డుపై గుంతల వద్ద ట్రాక్టర్లు పెట్టి స్థానికులతో కలిసి ధర్నా నిర్వహించారు. దీంతో కొత్తగూడెం మున్సిపాలిటీలోని 16వ వార్డు కౌన్సిలర్ రాజకుమారి, మాచర్ల శ్రీనివాస్ అక్కడికి చేరుకొని, మున్సిపల్ డీఈ పిలిపించి మాట్లాడారు. దీంతో పాత పోలీసు స్టేషన్ నుంచి ఎదురుగడ్డ పంచాయతీలోని రోడ్డు వరకు తారు రోడ్డు నిర్మాణంతోపాటు డ్రెయినేజీ నిర్మాణానికి రూ.2 కోట్లు కేటాయించారు. ఈ టెండర్ ప్రక్రియ ఆర్అండ్‌బీ శాఖలో ఉంది. కానీ అప్పటి ఎమ్మెల్యే పట్టించుకోకపోవడంతో ఈ ప్రకియ మూలన పడింది.

పంచాయితీ తెగడం లేదు..

కొత్తగూడెం మున్సిపాలిటీ 16వ వార్డులోని మురుగు ఎదురుగడ్డ గ్రామ పంచాయతీలోకి వచ్చి ప్రధాన రహదారిపై నిల్వ ఉంటుండడంతో వివాదానికి దారితీసింది. రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి మున్సిపాలిటీ నుంచి రూ.2 కోట్లు కేటాయించామని చెబుతున్నా అమలుకు నోచుకోలేదు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారింది. ఇది ఎప్పటికి పరిష్కారం అవుతుందో సమాధానం లేని ప్రశ్నగా మిగిలిపోయింది.

తరుచూ ప్రమాదాలు..



ఎదురుగడ్డ పంచాయతీలోని తారు రోడ్డుపై మున్సిపల్ మురుగు నిల్వ ఉండడం వల్ల గుంతలు ఏర్పడి తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవటం లేదు. నిత్యం వందలాది వాహనాలు వచ్చిపోతున్న ఈ మార్గం సరిగా లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– చావల పురుషోత్తం

ఇబ్బందులు తొలగించాలి



కొత్తగూడెం నుంచి ఎదురుగడ్డ, హేమచంద్రాపురం, కారుకొండ, బొమ్మనపల్లి మీదుగా వాహనాలు ఇల్లెందు వెళ్తుంటాయి. ఎదురుగడ్డ వద్ద రోడ్డుపై ఉన్న గుంతల వల్ల వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవటం లేదు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని సమస్యను పరిష్కరించాలి.

– బండ వెంకటేశ్వర్లు, హేమచంద్రాపురం

త్వరలో పరిష్కారం...



పాత పోలీసు స్టేషన్ నుంచి ఎదురుగడ్డ వరకు రోడ్డు, డ్రెయినేజీకి రూ.2 కోట్లు మంజూరయ్యాయి. ఆర్అండ్‌బీ శాఖలో టెండర్ ప్రక్రియ ఉంది. అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావటంతో ఆగిపోయింది. ప్రస్తుతం తారు రోడ్డు, డ్రెయినేజీ, సెంట్రల్ లైటింగ్‌కు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శంకుస్థాపన చేస్తారు.

– రాజకుమారి, 16వ వార్డు కౌన్సిలర్

'ఆర్ఆర్ఆర్'కు భారీ మెజార్టీ..



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తగూడెంరూరల్: ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తారని జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. మంగళవారం చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలో మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటు హక్కు వినియోగించుకున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసిన రామసహాయం రఘురాంరెడ్డిని గెలిపించేందుకు కొత్తగూడెం నియోజవర్గంలోని ఓటర్లకు రుణపడి ఉంటామన్నారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా పోలింగ్‌లో పాల్గొన్ని వారికి ధన్యవాదలు తెలిపారు. జిల్లా చరిత్రలోనే ఎవరూ ఊహించనంత మెజార్టీతో ఆర్ఆర్ఆర్ గెలువబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కోనేరు సత్యనారాయణ, నాగసీతారాములు, దేవీప్రసన్న, శ్రీనివాస్‌రెడ్డి, చింతలపూడి రాజశేఖర్, అంతోటి పాల్, గొల్లపల్లి దయానంద్, చీకటి కార్తీక్, పాల సత్యనారాయణరెడ్డి, బాలప్రసాద్, రాము, సుందర్‌లాల్ కోరి, వెంకటేష్, కనకరాజు, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయం..



మాట్లాడుతున్న కొత్వాల

పాల్వంచ: ఖమ్మం పార్లమెంట్‌కు సోమవారం జరిగిన ఎన్నికల్లో మిత్రపక్షాలు బలపర్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి గెలుపు ఖాయం అని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.

మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్, రైతుబంధు మంజూరయ్యాయని, త్వరలోనే రుణమాఫీ కానుండటం పట్ల రైతుల సైతం ఆకర్షితులై ఎన్నికల్లో బ్రహ్మరథం పట్టారని చెప్పారు. కాంగ్రెస్ నేతృత్వంలో ఇండియా కూటమి మెజారిటీ సీట్లు సాధిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అబ్యర్థి కోసం అహర్నిషలు శ్రమించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

మరోసారి బలరాంనాయక్‌దే విజయం



మాట్లాడుతున్న నాయకులు

ఇల్లెందు: మహబూబాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ మరోమారు గెలుపు ఖాయం అయిందని నియోజకవర్గంలోని ఐదు మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఇల్లెందు జేకేలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పులి సైదులు, భూక్యా దేవానాయక్, ధనియాకుల రామారావు, కంభాల ముసలయ్య, గింజల నర్సిరెడ్డి, పట్టణ అధక్షుడు దొడ్డా డానియేల్, మండల వర్కింగ్ ప్రసిడెంట్ ఎట్టి హరికృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి ఆరెం కిరణ్, పట్టణ ప్రధాన కార్యదర్శి జాఫర్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన్ కోరి, పట్టణ నాయకులు చిల్లా శ్రీనివాస్‌లు మాట్లాడారు.

నిన్నటి ఎన్నికల్లో ప్రజలు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొని కాంగ్రెస్‌కు తమ మద్దతు ప్రకటించారని తెలిపారు. తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియా, రాహుల్ ప్రధానిని చేయటం లక్ష్యంగా ఓటర్లు ముందుకొచ్చినట్లు చెప్పారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే కోరం కనకయ్యకు నమోదు అయిన మెజార్టీ బలరాం నాయక్‌కు పునరావృతం అవుతుందని తెలిపారు.

ఓటేసిన ప్రజలకు, కష్టపడి పనిచేసిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, ఇండియా కూటమిలోని పార్టీల నేతలకు, మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పాదెం వీరయ్య, ఎమ్మెల్యే కోరం కనకయ్యలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులపై లాఠీచార్జ్ అమానుషం

కొత్తగూడెంఅర్బన్: కేంద్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జీఓ నంబర్ 596 ప్రకారం ఎన్నికల విధులు నారాయణఖేడ్‌లో నిర్వహించి రావలసిన రెమ్యునరేషన్ అడిగిన ఉపాధ్యాయులపై లాఠీచార్జ్ చేయడం అమానుషమని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రవి మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు.

లాఠీచార్జ్ గావించిన అధికారులపై, పోలీసులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రెమ్యూనేషన్ ఉత్తర్వులకు అనుగుణంగా, మిగతా జిల్లా వారు చెల్లించిన విధంగా చెల్లించాలని, చెల్లించకుండా అమానుషంగా లాఠీఛార్జ్ చేయడం సరైంది కాదని, అధికారుల తీరు ఆక్షేపణీయం అని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తీవ్రంగా ఖండిస్తున్నాం..

బేషరతుగా ఉపాధ్యాయలకు నారాయణఖేడ్‌లోని ఆర్డీఓ, పోలీసులు క్షమాపణ చెప్పాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం కోటా శివశంకర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రాణాలు సైతం లెక్కచేయకుండా అనేక మంది ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల విధి నిర్వహణలో భాగంగా ఎంతో కష్టపడి పని చేస్తుంటే వారికి రావాల్సిన గౌరవ వేతనం కూడా అక్కడ స్థానిక ఆర్డీఓ చాలా దారుణంగా సగానికి సగం డబ్బులు ఇవ్వడాన్ని నిరసిస్తూ టీచర్లు ఆందోళనలు చేస్తే వారిపై అమానుషంగా లాఠీచార్జ్ చేయడం సమాజానికి సిగ్గుచేటన్నారు. ఇలా టీచర్లను అవమానపరచడం చాలా అన్యాయమని వెంటనే బేషరతుగా ఆర్డీఓను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల విధి నిర్వహణలో పనిచేసిన వారందరికీ గౌరవ వేతనం సమానంగా అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉద్యోగులకు భద్రతపై అవగాహన



మాట్లాడుతున్న ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు

ఇల్లెందు: జేకే ఓసీలో పనిచేసే ఉద్యోగులకు ఉత్పత్తి, ఉత్పాదక, భద్రతపై అవగాహన అవసరమని ప్రాజెక్టు ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఇల్లెందు జేకే ఓసీలో ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాంత్రిక శక్తిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. యంత్రాల పని గంటలు పెంచాలని సూచించారు. బొగ్గు ఉత్పత్తి, రవాణా రోజు వారీగా లక్ష్యాలను పెంచాలని చెప్పారు. బొగ్గు ఉత్పత్తి, రవాణాకు ఎటువంటి ఆటంకం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సింగరేణి అధికారులు శివప్రసాద్, చిన్నయ్య, సుధాకర్, గుర్తింపు సంఘం ఫిట్ కార్యదర్శి సంజీవచారి, ప్రాతినిధ్య సంఘం కార్యదర్శి బాబూరావు ఉన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి



సూచనలు చేస్తున్న సైదులు

కొత్తగూడెంఅర్బన్: వేసవిలో ఉచితంగా నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సమ్మిళిత విద్యా కోఆర్డినేటర్ ఎస్‌కే సైదులు అన్నారు. మంగళవారం సుజాతనగర్ మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉన్న భవిత కేంద్రాన్ని ఆకస్మికంగా సైదులు సందర్శించారు. దివ్యాంగుల కొరకు ప్రతీ వారం మండల కేంద్రంలో ఫిజియోథెరపీ సేవలను ఉచితంగా అందజేస్తామని, 18సంవత్సరాల లోపు దివ్యాంగ పిల్లలు సద్వినియోగం చేసుకునేటట్టు అందరూ సహకరించాలని కోరారు. అనంతరం కేంద్రంలో జరుగుతున్న ఫిజియోథెరపీ క్యాంపునకు వచ్చిన దివ్యాంగ పిల్లలు, తల్లిదండ్రులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు ఫిజియోథెరపీ క్యాంపునకు వచ్చే సెరిబ్రల్‌పల్స్ పిల్లవాడికి నడవడానికి రోలెటర్ ఇప్పించమని కోరగా, స్పందించిన కోఆర్డినేటర్ రెండు రోజుల్లో ఇచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. క్యాంపునకు రాని పిల్లల తల్లిదండ్రులతో ఫోన్ ద్వారా స్వయంగా మాట్లాడి ఫిజియోథెరపీ గురించి వివరించి వారిని చైతన్య పరిచారు. జిల్లాలోని అన్ని మండలాల సమ్మిళిత విద్య ఉపాధ్యాయులు ప్రతీ వారం మండల కేంద్రంలో జరుగుతున్న ఫిజియోథెరపీ క్యాంపునను దివ్యాంగుల పిల్లలు సద్వినియోగం చేసుకోనేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమ్మిళిత విద్య ఉపాధ్యాయులు శ్రావణ్ కుమార్, బేబీ, ఫిజియోథెరపిస్ట్ జె.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి..



ప్రమాదకరంగా రోళ్లపాడు క్రాస్ రోడ్

టేకులపల్లి: టేకులపల్లి మండలం రోళ్లపాడు క్రాస్ రోడ్ ప్రమాదకరంగా ఉంది. ఇల్లెందు – కొత్తగూడెం ప్రధాన రహదారికి ఆనుకుని రోళ్లపాడు గ్రామానికి వెళ్లేందుకు రహదారి ఉంది. ఇల్లెందు – కొత్తగూడెం ప్రధాన రహదారిలో ప్రతీరోజు 24 గంటలూ వందలాది చిన్న, పెద్ద వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోళ్లపాడు గ్రామానికి వెళ్లే క్రాస్ రోడ్ సమీపంలో ఎలాంటి సూచిక, హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయలేదు. దీనితో పలు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. స్థానికులకు తప్ప ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పోయే వారికి రోళ్లపాడు క్రాస్‌రోడ్ గురించి తెలియకపోవడం వల్ల వేగంగా వచ్చి ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత శాఖాధికారులు స్పందించి రోళ్లపాడు క్రాస్‌రోడ్ సమీపంలో ఇల్లెందు వైపు, టేకులపల్లి వైపు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి..



రోళ్లపాడు క్రాస్ రోడ్ వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేవు. దీంతో ఇల్లెందు, టేకులపల్లి నుంచి వచ్చేపోయే వాహనాలు వేగంగా వెళ్లడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అనేక మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఉన్నతాధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.

– కొడెం రామనాథం, రోళ్లపాడు

ఓటింగ్‌కు పలువురు డుమ్మా..

- మొన్నటి అసెంబ్లీ– నిన్నటి ఎంపీ ఎన్నికలకు 10 శాతం వ్యత్యాసం
- నియోజకవర్గంలో 2,25,097 మంది ఓటర్లు
- 66,284 మంది ఓటింగ్‌కు దూరం



ఇల్లెందు: ఓటేసిన ఓటర్లు

ఇల్లెందు/టేకులపల్లి: మహబూబాబాద్ ఎంపీ ఎన్నికలకు, మొన్నటి అసెంబ్లీ ఎన్నికలకు మధ్య ఓటింగ్ పది శాతం వ్యత్యాసం ఉంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఇల్లెందు నియోజకవర్గంలో 2,19,569 ఓట్లు ఉండగా ఎంపీ ఎన్నికల నాటికి 2,25,097 ఓట్లు ఉన్నాయి. నాలుగు నెలల కాలంలో 5,528 ఓట్లు పెరిగాయి. 2019 ఎంపీ ఎన్నికలకు 2,19,569 మందికి గానూ 1,76,840 మంది ఓట్లు వేయగా 79.32 శాతం పోలింగ్ నమోదు అయింది. ప్రస్తుతం ఎంపీ ఎన్నికలకు 2,25,097 మంది ఓటర్లు ఉండగా 1,58,813 మంది ఓట్లు వేశారు. 70.55 శాతం నమోదు అయిది. ఓట్లు పెరిగినా ఓటింగ్ శాతం మాత్రం ఆశించినంత పెరగలేదు. ఎన్నికకు ముందు రోజు వర్షం కురిసి వాతావరణం చల్లబడటం వల్ల ప్రజలు ఓటింగ్‌కు తరలివచ్చారు. అందువల్లే 70.55 శాతం నమోదు అయింది. నిన్నటి ఎంపీ ఎన్నకలకు ఇల్లెందు నియోజకవర్గంలో 2,25,097 మంది ఓటర్లు ఉండగా 1,58,813 ఓట్లు పోలయ్యాయి. ఇందులో పురుషులు 1,09,888 మంది ఉండగా 78,153 పోల్ కాగా, మహిళలు 1,15,205 మంది ఉండగా 80,658 పోలయ్యాయి. ఉదయం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 70.55 శాతం పోలింగ్ నమోదు కాగా 9 గంటలకు 11.90 శాతం నమోదు అయ్యింది. 11 గంటల వరకు 30. 3 శాతం, మధ్యాహ్నం 1 గంట వరకు 47.58 శాతం, 3 గంటల వరకు 61.86 శాతం, సాయంత్రం 4 గంటల వరకు 69.11శాతం, 5 గంటల వరకు 70.55 శాతం ఓటింగ్ నమోదు అయింది.

66,284 మంది ఓటర్లు డుమ్మా...

ఈసారి ఎన్నికల్లో నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాలలో 2,25,097 మంది ఓటర్లు ఉండగా 1,58,813 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అయితే 66,284 మంది ఓటేసేందుకు విముఖత చూపారు. పురుషులు 31.735 మంది మహిళలు 34,547 మంది ఓటు వెయ్యలేదు.

మండలాల వారీగా ఓటింగ్...

- ఇల్లెందు మండలంలో 80,150 ఓట్లరు ఉండగా 52,698 మంది ఓటు వేశారు. 27,454 మంది ఓటు వెయ్యలేదు,
- బయ్యారం మండలంలో 37,969 మంది ఓటర్లు ఉండగా 26,353 మంది ఓటేశారు. 11,616 మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు.
- టేకులపల్లి మండలంలో 41,183 మంది ఓటర్లు ఉండగా 30,892 మంది ఓటేశారు. 10,291 మంది దుమ్మా కొట్టారు.
- గార్ల మండలంలో 30,399 మంది ఓటర్లు ఉండగా 21,603 మంది ఓటు వేశారు. 8,796 మంది బద్ధకించారు.
- కామేపల్లి మండలంలో 35,159 మంది ఓటర్లు ఉండగా 27,058 మంది ఓటేశారు. 8,101 మందికి ఓటు వేసేందుకు తీరిక దొరకలేదు.



టేకులపల్లిలో బారులు తీరిన ఓటర్లు



తొమ్మిదోమైలు తండాలో...

ఈదురుగాలులతో బీభత్సం





మొక్కంపాడుతండాలో ఓ ఇంటిపై విరగి పడిన వృక్షం, ఎగిరిపోయిన ఇంటి పైకప్పు

టేకులపల్లి: మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు బీభత్సం సృష్టించాయి. వచ్చిన కొద్ది నిమిషాల్లోనే విపరీతమైన ఈదురు గాలులతో మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. మొక్కంపాడుతండాలో బానోతు నరేష్ రెండు రోజుల క్రితమే గృహ ప్రవేశం చేసిన ఇంటి పైకప్పు రేకులు గాలికి ఎగిరిపోయాయి. ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉంది. బానోతు రవి ఇంటిపై భారీ వృక్షం పడటంతో ప్రహరీకి పగుళ్లు ఏర్పడ్డాయి. తీవ్ర నష్టం జరిగింది. దేవాలయం సమీపంలో విద్యుత్ స్తంభం విరిగిపడింది. కారేపల్లి తండా సమీపంలో రోడ్డు వెంబడి ఉన్న పెద్దపెద్ద చెట్లు కూకటివేళ్లతో నేలకొరిగాయి.



ఆలయం వద్ద విరిగిన విద్యుత్ స్తంభాలు